మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | గురువారం | 18-12-2025 | సంపుటి : 14 | సంచిక :192 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Thursday | 18-12-2025 | Volume :14 | Issue:192 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ముర్ము



అల్వాల్, మేడ్చల్,డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) :రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం 2:55 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్న ముర్ముకు గవర్నర్ జిష్ణుదే వ్వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, త్రివిధ దళాలకు చెందిన అధికారులతో పాటు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, డీజీపీ బి.శివధర్‌రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, సైబరాబాద్ పోలీస్ కమిష నర్ అవినాష్ మహంతి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముర్ము రోడ్డు మార్గం ద్వారా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. 22 వరకు రాష్ట్రపతి ఇక్కడే బస చేసి నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొం టారు.

రేపటినుంచి పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సుదేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్

2లో

## పల్లెపోరు...

# హస్తం జోరు

**తెలంగాణలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించింది.**






హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించింది. మొత్తం 4,158 స్థానాల్లో ఎక్కువ చోట్ల కాంగ్రెస్ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. రాత్రి 7.50 గంటల వరకు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవాలతో కలిపి 1772, %దీ=ూ% 903, బీజేపీ 169, ఇతరులు 379 సర్పంచ్ స్థానాల్లో గెలు పొందారు. మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా.. 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,752 సర్పంచి పదవులకు బుధవారం పోలింగ్ జరిగింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై


# స్పీకర్ సంచలన తీర్పు



హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ డిసెంబరు 17 (బుధ వారం) తీర్పు వెలువరించారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపుల ఆరో పణలను స్పీకర్ తోసిపుచ్చారు. వారు పార్టీ ఫిరాయించినట్టు ఎక్కడా ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటో న్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులు ఫిరాయింపులకు పాల్పడలేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ వాదనలతో ఏకీభవిం చని స్పీకర్.. ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి నిరాకరించారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్య విషయంలో నాలుగు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గడువు విధించిన నేపథ్యంలో స్పీకర్ తీర్పు వెలువరించారు. 2023 తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి విజయం సాధించిన 10 మంది ఎమ్మెల్యేలు.. తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఈ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను కోరుతూ బీఆర్ఎస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇంకో పార్టీలో చేరితే అనర్హులుగా ప్రకటించాలి. కానీ, అధికారికంగా మార డం లేదా విప్ ధిక్కరించాల్సి ఉంటుంది. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని మర్యాదపూర్వకంగా సీఎంను కలిశామని స్పీకర్ వద్ద వివరణ ఇచ్చారు. మిగతా ఐదుగురు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌ల అన ర్హత పిటిషన్లపై విచారణ జరిగింది. వీరిలో కడియం, దానం నాగేందర్‌లు త మ నిర్ణయం చెప్పడానికి స్పీకర్‌ను కొంత సమయం కోరారు. పోచారం, కాలే యాద య్య, సంజయ్ కుమార్‌లపై పిటిషన్ల విచా రణ పూర్తి కావడంతో త్వరలోనే స్పీకర్ నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. తాము స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా అనర్హతపై నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నా రని తొలుత బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. పదో షెడ్యూ ల్ ప్రకారం అనర్హతపై నిర్ణయం తీసుకోవా లని స్పీకర్‌కు సూచిం చింది. ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం... 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జులై 2025న ఆదేశించిం ది. అక్టోబర్ 31తో మూడు నెలల గడువు పూర్తికావడంతో 'గ్రాస్ కంటెంప్ట్' అంటూ సుప్రీంకోర్టు హెచ్చరించింది. నాలుగు వారాల్లో అంటే డిసెంబర్ 18లోపు నిర్ణయం తీసుకో వాలని స్పీకర్‌కు స్పష్టం చేసింది. ఈ క్రమంలో స్పీకర్ విచారణ ముగించి, ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి తొలి దశలో తీర్పు ఇచ్చారు.



# కొత్త డిస్కమ్ ప్రారంభానికి ఆమోదం



హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : తెలంగాణలో మరో కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఉన్న రెండు డిస్కమ్‌లకు ప్రత్యామ్నాయంగా మూడవ డిస్కమ్ ఏర్పాటుకు ఆమోదం మంజూరు చేయబడింది.మూడవ డిస్కమ్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వం తీసుకున్న ముఖ్య నిర్ణయంగా ఉంది. ప్రస్తుతం టీఎస్ఎస్‌పీడీసీఎల్ మరియు టీఎస్ఎన్‌పీడీసీఎల్ ద్వారా నిర్వహించబడుతున్న విద్యుత్ పంపిణీ వ్యవస్థలో భాగంగా, మూడవ డిస్కమ్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆమో దం తెలిపింది.వ్యవసాయం మరియు ఇతర వర్గాలకు ఉచిత, సబ్సిడీ విద్యుత్ అందించడం, సగటు బిల్లింగ్ రేటు మరియు సేవల ఖర్చుల మధ్య వ్యత్యా సం కారణంగా డిస్కంల ఆర్థిక పరిస్థితి ప్రభావితమయ్యింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, మౌలిక సదుపా యాల అభివృద్ధి, వంటి కేంద్ర పథకాల అమలు సులభ తరం చేయడం లక్ష్యంగా మూడవ డిస్కమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఇథియోపియాలో పర్యటిస్తున్న మోడీ


డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : ప్రధాని నరేంద్ర మోదీ తన ఇథియో పియా పర్యటనలో భాగంగా ఈరోజు ఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావే శంలో ప్రసంగించారు. భారత్, ఇథి యోపియా మధ్య వాతావరణంలోనే కాకుండా స్ఫూర్తిలోనూ సారూప్యత ఉ ందని అన్నారు. ఈ పర్యటన సందర్భం గా మోదీకి అరుదైన గౌరవం లభిం చింది. ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీ స్వయంగా కారు నడు పుతూ విమానాశ్రయం నుంచి హోట ల్ వరకు మోదీని తీసుకువచ్చారు. పార్లమెంటులో మోదీ మాట్లాడు తూ.. రెండు దేశాల మధ్య రెండు వేల ఏళ్ల నాటి చారిత్రక, వాణిజ్య సంబం ధాలను గుర్తుచేశా రు. ఆధునిక కాలంలో ఇథి యోపియా విముక్తి కోసం భారత సైనికులు కూడా పోరాడా రని తెలిపారు. ముఖ్యంగా వేలాది మంది భారతీయ ఉపాధ్యాయులు ఇక్కడికి వచ్చి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దారని, వారు ఇథియోపియా ప్రజల హృదయాలను గెలుచుకున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో భారత్ 150కి పైగా దేశాలకు మందులు, వ్యాక్సిన్లు పంపిందని, అందులో భాగంగా ఇథియోపియాకు 4 మిలియన్లకు పైగా డోసులు అందించడం గర్వకారణమని అన్నారు.



## ఒక్కరైనా స్పందించి ఉంటే.... ఆ ప్రాణం నిలిచేదేమో?!

బెంగళూరు, డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : చికిత్సకోసం వాహ నంపై వెళుతూ గుండెపోటుతో ఒక్కసా రిగా కుప్పకూలిపోయాడు... భర్తను కాపాడుకోవాలని అతని భార్య వాహన దారులను సాయం కోసం ఎంతగానో అర్థించింది. కానీ, ఎవరూ స్పందించక పోవడంతో చివరకు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన బెంగళూ రు నగరంలోని బనశంకరి సమీపంలో ఈ నెల 13న చోటు చేసుకుంది. బనశంకరిలోని కదిరేనహళ్లికి చెందిన వెంకట రమణన్(34)కు ఈ నెల 13వ తేదీ తెల్లవారున 3.30 గంటల

2లో



# వెండి ధర పైపైకి




డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : ఇటీవలి కాలంలో వెండి ధర వార్షికంగా అద్భుతంగా పెరిగి చరిత్రా రికార్డును సృష్టించింది. భారత మార్కెట్‌లో మీద వెండి ధర కిలోకు సుమారు రూ.2హొలక్షలకు పైగా చేరింది, ఇది గతంలో ఎవరో ఊహించని స్థాయి అని మార్కెట్‌లో చెప్పబడుతోంది. ఈ పెరుగుదలతో పాటు, అంతర్జాతీయంగా కూడా వెండి ఔన్సు వరుసగా రికార్డ్ బ్రేక్ చేసి 66హొపైగా ట్రేడవుతుంది. వెండి ధర ఇప్పుడు ఒక అరుదైన సంఘటనలో 40 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా క్రూడ్ ఆయిల్ ధరను మించి నిలిచింది, అంటే వెండి ధర

2లో

# పల్లె ప్రజల తీర్పు..

## కాంగ్రెస్ పతనానికి నాంది!



హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే హైదరాబాద్) : రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో పల్లె ప్రజలు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ పతనానికి నాంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అధికార పక్షానికి ఏకపక్షంగా ఉంటాయని, అయితే ముఖ్యమంత్రి, కాలికి బలపం కట్టుకొని తిరిగినా.. మంత్రులు మోహరించినా సగం సీట్లు సాధించడానికి కాంగ్రెస్ తంటాలు పడిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలతో సీఎం రేవంత్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టాయన్నారు. అధికార పార్టీ ఇంత తక్కువ స్థానాలకు పరిమితం కావడం, ప్రదాన ప్రతిపక్షం ఇన్ని పంచాయతీలను గెలవడం గతంలో ఎన్నడూ లేదన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ మోసాలు, వైఫ ల్యాలపై తెలంగాణ పల్లె ప్రజలు మోగిం చిన జంగ్ సైరన్ అని పేర్కొ న్నారు. రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారని, హామీలు అమలు చేయ కుండా.. రైతాంగాన్ని ఇబ్బంది పెట్టారని, పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టారని ఆరోపించారు. రెండేళ్లలో హామీలు అమలు చేయకుండా, పల్లెల్లో రాజకీయ హింసను తెచ్చిన కాంగ్రెసకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ తీర్పు తర్వాత రానున్న ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ మరింత పతనం కాక తప్పదన్నారు. కాంగ్రెస్ అదికార దుర్వినియోగాన్ని, బల ప్రయోగాన్ని, హింసను ఎదుర్కొని, తమ పక్షాన నిలబడి పోరాడే బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఇది సామాన్య విజయం కాదని, చరిత్రలో నిలిచిపోయే పోరాట మని, ఈ యుద్ధంలో సైనికుల్లా పోరాడిన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకు సలాం చేస్తున్నానన్నారు. అరాచక కాంగ్రె సను, రేవంత్‌రెడ్డిని మట్టి కరిపించేందుకు గులా బీ శ్రేణులు చేసిన అలుపెరగని పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నా రు. బీఆర్ ఎస్ కార్య కర్తలపై దాడులకు తెగబడు తున్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో సమాధానం చెబుతామని కేటీఆర్ హెచ్చ రించారు. కాగా బీఆర్ఎసపార్టీ ప్రధాన కార్యాలయ మైన తెలంగాణ భవన్‌లో బుధవారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఆపార్టీ నేతలు సీహెచ్ రాకేశ్‌కుమార్, తలసాని సాయి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు.

# దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం : ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లలో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. అభివృద్ధి పనులలో భాగంగా బుధవారం మియాపూర్ డివిజన్ పరిధిలోరూ.1 కోటి 77 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డు రూ. 45 లక్షలు, టాకీ టౌన్ థియేటర్ రోడ్డు నుండి మియాపూర్ విలేజ్ మసీదు వరకు రూ.95 లక్షలతో,బొల్లారం మెయిన్ రోడ్డు నుండి ప్రజయ్ షెల్టర్ అపార్ట్మెంట్స్ వరకు రూ.37.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా ఎప్పటి కప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఎక్కడైన పెండింగ్ పనులు ఉన్నైట్లైతే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కాలనీవాసులకు సూచించారు. అభివృద్ధి పనులలో



నాణ్యత లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు



**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):**హబ్సిగూడ ఎన్జీఆర్ఐ వద్ద గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం హుండీ లెక్కించారు. సుమారు నాలుగు నెలల 20 రోజుల హుండి ఆదాయం రూ.4,42,330 వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకులు డి. రవి ఆధ్వర్యంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కే. వెంకన్న ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో హుండీ లెక్కించారు. కార్యక్రమంలో తుమ్మల దేవి రెడ్డి, ఈగ అంజయ్య,బిక్కుమల్ల అంజయ్య గుప్తా, జి. రాజేశ్వరి,ఎ. అమరేశ్వరి,బి. రఘునాథ్ రెడ్డి, ధర్మ నాయక్,జి. రాఘవేంద్ర,జి. లక్ష్మారెడ్డి,ఏ అంజయ్య,ఆలయ అర్చకులు గంభీరపురంరవీంద్ర శర్మ,సంతోష్ శర్మ,శ్రీకాంత్ శర్మ భక్తులు పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కొరకై ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రెటరీ ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి పనులకై నిధులు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రెటరీ బి. అజిత్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. తరగతి గదుల కొరత, ఉపాధ్యాయుల కొరత కొన్ని పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకమును కొనసాగించుటకు వంట గదుల కొరత , కొన్ని పాఠశాలలో మరుగుదొడ్డుల కొరత, ఎంపీపీస్ వెస్లీ నాచారం పాఠశాల కు నూతన భవన నిర్మాణం వంటి వాటిని మంజూరు చేయుట కొరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ముందుగా సమస్యలను వివరించి వారి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ బి అజిత్ రెడ్డి గారిని కలిసి ఉప్పల్ నియోజకవర్గంలోని పాఠశాలలలో సదుపాయాల లేమిని మరియు ఉపాధ్యాయుల కొరతను వివరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ , బి ఆర్ ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ గారు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్



**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** హబ్సిగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ తిండేరు సురేఖ,హనుమంతరావు నివాసంలో బుధవారం జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నగేష్ గురుస్వామి, తిండేరు రోషన్,తిండేరు హర్ష,ప్రదాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి,సోమ శ్రీనివాస్ కొత్తపల్లి రమేష్ ,అరవింద్,కొండేరు స్రవంతి ,బిజెపి నాయకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# బస్తీ వాసుల సమస్యపై సత్వరమే స్పందించిన ఆకారపు అరుణ్ పటేల్





**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ ఈస్ట్ శ్రీనివాసపురం, రామ్ శంకర్ నగర్ కాలనీలలో జరుగుతున్న ఓపెన్ నాలా నిర్మాణ పనుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక ప్రజలు ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. నాలా ఎత్తు పెంచడం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ప్రజలు తెలియజేయడంతోవెంటనే స్పందించిన అరుణ్ ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి సహకారంతో సంబంధిత డి ఈ, ఏఈ సంబంధిత అధికారులతో మాట్లాడారు.
ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పనులను తక్షణమే సరిదిద్దాలని, రోడ్డు ఎత్తుకు తగ్గట్టుగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా నాలాను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సౌకర్యార్థం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.రామ్ శంకర్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగడం లేదని, చీకటి కారణంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న విషయం స్థానికులు అరుణ్ దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి, పాడైపోయిన పాత లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులో అనిల్, జగదీష్, మధు, రవితేజ, ఎల్. వి. గౌడ్, నాగరాజ్ ప్రొఫెసర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# గూగుల్ మ్యాప్స్ చూసుకుంటూ వెళ్లిన లారీ,,,, డ్రైవర్‌కు ఊహించని అనుభవం

ఓ పాతికేళ్ల క్రితం వరకు కూడా తెలియని ప్రాంతానికి వెళ్లాలనుకుంటే.. ఎవరిని అయినా దారి అడుగుకుంటూ వెళ్లేవాళ్లం. లేదంటే ఆ ఏరియా గురించి బాగా తెలిసిన వారిని తీసుకుని వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేశామా.. దాన్ని ఫాలో అవుతూ వెళ్తే సరి. అయితే మనిషి చెప్పినంత కచ్చితంగా ఈ గూగుల్ మ్యాప్ అడ్రస్ చెబుతుందా అంటే.. చాలా వరకు సందర్భాల్లో సరిగ్గానే గమ్యస్థానం చేరుస్తుంది. కానీ కొన్నిసార్లు మాత్రం చిత్ర విచిత్రమైన దారుల్లోకి తీసుకెళుతుంది. తాజాగా తెలంగాణలో ఓ లారీ డ్రైవర్‌కు ఇదే పరిస్థితి ఎదురయ్యింది. నదిలోకి వెళ్లబోయిన వ్యక్తి ఆఖరి నిమిషంలో అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. గూగుల్ మ్యాప్ చూసుకుంటూ వెళ్లిన ఓ లారీ డ్రైవర్.. నదిలోకి దూసుకెళ్లాడు. కానీ ఆఖరి నిమిషంలో అప్రమత్తం కావడంతో.. ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో వెలుగు చూసింది. బాషా అనే లారీ డ్రైవర్.. ఆంధ్రప్రదేశ్‌లోని బేతంచర్ల నుంచి తెలంగాణ మక్తల్ పట్టణానికి బండల లోడుతో వస్తున్నాడు.

బాషా అనే వ్యక్తి ఏపీలోని బేతంచర్ల నుంచి తెలంగాణలోని మక్తల్ పట్టణానికి తన లారీలో బండల లోడుతో వస్తున్నాడు. కొత్తకోట మండలం దగ్గరకు వచ్చాక.. జాతీయ రహదారి 44 మీదుగా ఆత్మకూరు నుంచి మక్తల్ వెళ్లేందుకు గూగుల్ మ్యాప్ ఆన్ చేసుకున్నాడు.

తెల్లవారుజామున కావడంతో రోడ్ల మీద జనాలు కూడా పెద్దగా లేరు. దీంతో దారిని అడిగేందుకు ఎవరూ కనిపించకపోవడంతో.. గూగుల్ మ్యాప్ మీద ఆధారపడ్డాడు. మ్యాప్స్ ఆన్ చేసుకుని ప్రయాణం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆత్మకూరు వద్ద కుడి వైపునకు తిరగాల్సి ఉండగా.. మ్యాప్ ప్రకారం ఎదురుగా వెళ్లాడు. అలా సుమారు మూడు కిలోమీటర్ల వరకు ప్రయాణం చేశాడు. గూగుల్ మ్యాప్ ప్రకారం వెళ్లిన లారీ కాస్త.. లోయర్ జూరాల నది వద్దకు చేరుకుంది.

అప్పటి వరకు మ్యాప్ చూస్తూ ప్రయాణం చేస్తున్న లారీ డ్రైవర్.. ఎదురుగా నీరు కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. భయంతో వెంటనే లారీని ఆపేశాడు. దీంతో ఆఖరి నిమిషంలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. బండలను అన్‌లోడ్ చేసిన తర్వాత లారీని బయటకు తీశారు. ఈ సంఘటన గురించి తెలిసిన వారు మ్యాప్స్‌ను నమ్ముకుంటే మునగాల్సిందే అని కామెంట్ చేస్తున్నారు.



# ఉస్మానియా ఉద్యమ కెరటం గాదరి కిషోర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్





**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** బిఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ఉస్మానియా ఉద్యమ కెరటం గాదరి కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్లోని కళ్యాణపురి లోనీ వారి నివాసంలో వారికి శాలువాతో సత్కరించి, భారీ కేక్ కట్ చేయించి బాణాసంచార కాల్చి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కొకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫోటో బాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడికి సర్పంచ్ గా పట్టం కట్టిన ప్రజలు

### సర్పంచిగా గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగల పరశురాములు



**దేవర్రుల (నమస్తే హైదరాబాద్):** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి గ్రామంలో తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి తెలంగాణ ఉద్యమ నాయకుడు తీగల పరశురాములు సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ మరియు ఇండిపెండెంట్ అభ్యర్థులపై 98 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నా గెలుపు కు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం గొల్లపల్లి ప్రజలందరి విజయం అన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుతాన్ని అన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కేంద్రంపై జగ్గారెడ్డి ఆగ్రహం



**నమస్తే హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని చూస్తోందంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా కేవలం గాంధీ, నెహ్రూలను లక్ష్యంగా చేసుకుని రాజకీయాలు చేస్తున్నారని, వారి పేర్లను చరిత్ర నుంచి చెరిపేయాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈరోజు గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, బీజేపీ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.మోదీ, అమిత్ షాలు పుట్టకముందే, 1930లోనే గాంధీజీ 'రఘుపతి రాఘవ రాజారాం' అంటూ సత్యాగ్రహం చేశారని జగ్గారెడ్డి గుర్తుచేశారు. ప్రజలను ఏకం చేయడానికి గాంధీ రాముడి పేరు వాడితే, బీజేపీ మాత్రం అదే పేరుతో ప్రజలను విభజిస్తోందని విమర్శించారు. "గాంధీ, నెహ్రూ మీలా క్రిమినల్స్ కాదు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూ 12 ఏళ్లు జైలు జీవితం గడిపారు. అలాంటి వారిపై ఇప్పుడు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.కేంద్ర ప్రభుత్వ కుట్రలకు నిరసనగా త్వరలో సంగారెడ్డిలో లక్ష మందితో భారీ నిరసన సభ నిర్వహిస్తామని జగ్గారెడ్డి ప్రకటించారు. మోదీ పాలనలో పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని, రైతులు, యువతను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజలు ఏదో ఒకరోజు రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తారని, అప్పుడు బీజేపీ నేతల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాహుల్ ప్రధాని అయ్యాక ఈడీ, సీబీఐ వంటి సంస్థలు మీ మాట వింటాయా అని నిలదీశారు. అధికారం శాశ్వతం కాదని, బీజేపీ నేతలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.


## ఫుట్‌పాత్‌పై దూసుకెళ్లిన కార్ ఒకరు మృతి

హైదరాబాద్‌లోని మైలార్‌దేవ్‌పల్లిలో ఈ రోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో అదుపుతప్పిన ఓ ఇన్నోవా కారు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వలస వచ్చి జీవనం సాగిస్తున్న ఓ కుటుంబంలో ఈ ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రభు మహరాజ్ తన ఇద్దరు కుమారులతో కలిసి నగరానికి వలస వచ్చాడు. రోడ్డు పక్కన దుప్పట్లు, రగ్గులు అమ్ముకుంటూ జీవిస్తున్న వీరు, రాత్రిపూట తమ దుకాణం వద్దే ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నారు. శంషాబాద్ నుంచి సంతోష్ నగర్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు, అతివేగం కారణంగా అదుపుతప్పి నేరుగా వీరిపైకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో ప్రభు మహరాజ్ కుమారుడు దీపక్ అక్కడికక్కడే మరణించాడు. తండ్రి ప్రభు మహరాజ్, మరో కుమారుడు సత్తునాథ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఆరుగురు ఉన్నట్లు తెలిసింది. ఘటన అనంతరం వారిలో ముగ్గురు పరారవ్వగా, మిగిలిన ముగ్గురిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



## నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలిని: ఎన్ ఎస్ యు ఐ నాయకులు కిషోర్ బండిరాల

**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని అలాంటి కాలేజీల పై ఉక్కుపాదం మోపాలని ఉప్పల్ నియోజకవర్గం నాయకులు కిషోర్ బండిరాల విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా డి. ఐ. ఈ. ఓ. కిషన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ప్రతి పౌరుడి హక్కు అని విద్య వ్యాపారం చేసే పలు కాలేజీలో వివరాలను అందజేసినట్లు తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గం లో హబ్సిగూడ, ఉప్పల్, ఈసీఐఎల్ లో పలు కార్పొరేట్ కాలేజీలు శ్రీ చైతన్య, నారాయణ, విద్యాపీట్ విద్యాసంస్థలు విద్యార్థుల వద్ద లక్షల్లో ఫీజు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని కాలేజీలు విచ్చలవిడిగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని అలాంటి కాలేజీల పై తక్షణవే విద్య చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు వివిధ కోర్సులు పేరు చెప్పి అధిక మొత్తంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్లో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలపై కూడా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు పర్యవేక్షణ చేసి అనుమతులు లేని నిబంధన పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

### –ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఒక కోటి 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల రెడ్డి తో కలసి బుధవారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఓల్డ్ మల్లాపూర్ లో సుమారు 50 లక్షల రూపాయల తో సీసీ రోడ్డు పనులకు బాబానగర్ కాలనీ, గోకుల్ నగర్ కాలనీలో 70 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తానని అన్నారు. మల్లాపూర్ డివిజన్ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏ.ఈ శ్రవంతి, స్థానిక నాయకులు బోదాసు లక్ష్మీనారాయణ, చిగుళ్ల శ్రీనివాస్, తండా వాసుగౌడ్, నెమలి రవి, రాపోలు సతీష్, కుంటి కృష్ణ, జలగం శ్రీనివాస్, నాగరం బాబు, పీరు నాయక్, ఉస్మాన్, కర్రె శంకర్, మసూద్, అహ్మద్, మెండ రఘు, శంకర్ రెడ్డి, హనుమండ్ల విజయ్, సనాల రవి, వెంకట్, భాస్కర్, రమేష్ నాయక్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.42 లక్షలతో ఉప్పల్ సూర్యనగర్ కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణం: పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, డిసెంబర్ 17 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ డివిజన్ లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి ,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.అందులో భాగంగానే రజితపరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ సూర్యనగర్ లో విస్తృతంగా పర్యటించారు. ఈ కాలనీల్లో 42 లక్షల తో సీసీ రోడ్లు నిర్మాణం పనులను డి.ఈ. వినీల్ గౌడ్, ఏ.ఈ. రాజ్ కుమార్, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ మేనేజర్ సత్యనారాయణ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు.తొందరలోనే సూర్యనగర్ నగర్ కాలనీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్లు నిర్మాణం పనులు జరుగుతాయని కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమం లో ఏ ఎస్ ప్రసాద్ ,వి వెంకటేశ్వర్లు ,కృష్ణ రెడ్డి ,రాజేశ్వరి ,ఉషన్న,మేకల రామ్ రెడ్డి ,శామీర్పేట్ హనుమంత్ రెడ్డి ,రామలక్ష్మి,తుమ్మల దేవి రెడ్డి, రత్నం,శంకర్,శాస్త్రి,షమీర్పేట్ రాకేష్ రెడ్డి,దీక్షిత్,సంజీవ్ రెడ్డి లింగంపల్లి రామకృష్ణ,బీమ్ సేన్,కంచమిది శ్రీనివాస్,లింగ రెడ్డి,బొడిగే మల్లేష్,వెంకటేష్ డిసి ఎం,పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సంచలనం! ఒక్కో ఓటుకు రూ.1.50 లక్షలు

**( నమస్తే హైదరాబాద్):** తెలంగాణలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో చివరి దశ పోలింగ్ నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రికార్డు స్థాయిలో డబ్బుల పంపకాలు జరిగినట్లు సమాచారం.ఇంత స్థాయిలో డబ్బుల లావాదేవీలు బహుశా ఎమ్మెల్యే ఎన్నికల్లో కూడా చూడలేదని గ్రామస్తులే వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా హైదరాబాద్ శివారులోని శంకరపల్లి మండలంలోని గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు హోరాహోరీగా సాగుతున్నాయి. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు పరస్పరం పోటీ పడుతూ ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు.రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో సుమారు రూ.6 వేల కోట్ల వరకు డబ్బులు చేతులు మారినట్లు అంచనాలు వినిపిస్తున్నాయి. శంకరపల్లి గ్రామపంచాయతీ ఎన్నికలు మూడో దశలో భాగంగా ఈరోజు (సెప్టెంబర్ 17) నిర్వహించబడుతున్నాయి. సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న కొందరు అభ్యర్థులు భూములు అమ్ముకుని మరీ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.శంకరపల్లిలో ఒక్కో ఓటుకు రూ.55 వేల వరకు ఇచ్చినట్లు తెలుస్తోంది. తొలుత ఒక పార్టీకి చెందిన అభ్యర్థి ఒక్కో ఓటుకు రూ.40 వేల చొప్పున పంపిణీ చేయగా, దీనికి ప్రతిస్పందనగా మరో పార్టీ అభ్యర్థి రూ.50 వేల వరకు ఇచ్చాడని సమాచారం. వీరిద్దరికీ తగ్గకుండా మూడో పార్టీ అభ్యర్థి ఒక్కో ఓటరుకు రూ.55 వేల వరకు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా మొత్తం కలిపి ఒక్కో ఓటరుకు రూ.లక్షా 50 వేల వరకు డబ్బులు అందినట్లు చెబుతున్నారు.ఇక పటాన్చెరు ప్రాంతంలో ఓ సర్పంచ్ అభ్యర్థి సుమారు రూ.17 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో ఓటుకు వెయ్యి నుంచి ఐదు వేల రూపాయల వరకు పంచినట్లు తెలుస్తోంది. డబ్బులతో పాటు మద్యం, చీరలు, గిఫ్టులు బోనస్‌గా ఇచ్చి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. మరికొన్ని గ్రామాల్లో ఉంగరం గుర్తు ఉన్న అభ్యర్థులు ఏకంగా వెండి ఉంగరాలు పంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.అలాగే హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు గ్రామాలకు వచ్చే ఓటర్లకు ప్రయాణ ఖర్చులు కూడా అభ్యర్థులే భరిస్తున్నట్లు తెలుస్తోంది.



# నాకైనా అదే కొలమానం.. కలెక్టర్ల పనితీరుపై 'సంతృప్తి' లేదు

ఎక్కడో తేడా ఉన్నట్లుంది..చెక్ చేసుకోండి: సీఎం

పౌరులతో ప్రవర్తించే తీరు మారాల్సిందే

గ్రామంలో ప్రతి వర్గాన్నీ టచ్ చేయాలి

పెట్టుబడుల క్లియరెన్స్‌లో జాప్యం చేయొద్దు

మన విధానాలు చూసి రాష్ట్రానికొస్తున్నారు

అనుమతుల కోసం తిప్పించుకోవద్దు

ప్రెస్‌మీట్‌లు, సోషల్ మీడియాతోనే లక్ష్యాలు సాధించలేరు

చేతల్లో ప్రభుత్వంపై నమ్మకం తీసుకు రండి



**నమస్తే హైదరాబాద్ :** జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశంఅమరావతి, డిసెంబరు 17"మీరు బాగా పనిచేశామని అనుకుంటున్నారు. నేను కూడా అదే అనుకుంటున్నా. కానీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. మీ పనితీరును ప్రజలు మెచ్చడం లేదు. ఏ ప్రజల కోసం మీరు పనిచేస్తున్నారో...వారే మిమ్మల్ని మెచ్చుకోవడం లేదంటే ఎక్కడో ఏదో తేడా ఉంది. అదేమిటో గుర్తించండి. లోపాలు సరిదిద్దుకొని, జాగ్రత్తగా పనిచేయండి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు హితబోధ చేశారు. తన సహజశైలికి విరుద్ధంగా కలెక్టర్ల పనితీరుపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. "గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అనేక సమస్యలను పరిష్కరించుకుంటూనే ఒక వైపు ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. కానీ కలెక్టర్ల పనితీరుపై ప్రజల్లో ఆశించిన స్పందన లేదు." అంటూ స్పష్టమైన గణాంకాలు వినిపించారు. బుధవారం సచివాలయంలో మొదలైన జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ కలెక్టర్లు, ఇతర అధికారులపై పల్లెత్తు మాట అనని, వారిపై మాట పడనివ్వని చంద్రబాబు, దానికి భిన్నంగా తొలిసారి వారి విషయంలో వాస్తవిక పరిస్థితి ఏమిటనేది స్పష్టం చేశారు. కలెక్టర్ల పనితీరు, జిల్లాల్లో ప్రజా సంతృప్తి స్థాయి, సంక్షేమ పథకాల అమలు, ఇంకా పరిపాలన, ఈ-ఫైల్ విధానం, రెవెన్యూ అంశాలపై సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం ఏమన్నారనేది...ఆయన మాటల్లోనే...

సంతృప్తి స్థాయే ముఖ్యం...

"సుస్థిర అభివృద్ధి సాధన కోసం జరిగే పాలనలో ప్రజల సంతృప్తి స్థాయే ముఖ్యం. కానీ ప్రజా సంతృప్తితో సంబంధం లేకుండా మనం పనిచేస్తున్నాం. అందుకే నాతో సహా అందరం మనం చేసే పని వల్ల ప్రజలు మనతో కలిసి వస్తున్నారా, లేదా లేనేది చూడాలి. మీ జిల్లా, గ్రామీణ డేటా అంతా మీకు అందుబాటులో ఉంది. ఎక్కడ ఏ సమస్య ఉందో తెలుసుకోవడం చాలా సులభం. హార్డ్ వర్క్ కాదు..స్మార్ట్ వర్క్ చేసి ప్రజలను మెప్పించాలి."

క్లియరెన్స్‌ల్లో మీ స్పీడ్ చూస్తా..

"కూటమి ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకంతో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. వేగంగా ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. కానీ వాటికి అవసరమైన క్లియరెన్స్‌లన్నీ ఆలస్యమవుతున్నాయి. ప్రాజెక్టుల కోసం కొంతమంది తిరిగీ తిరిగీ మానేస్తున్నారు. ఇకపై ఏ కలెక్టరు ఏ ప్రాజెక్టును ఎంత స్పీడ్‌గా తీసుకెళ్లారో చూస్తా. పెట్టుబడులను పెట్టేవారిని తక్కువగా చూడటం సరికాదు. ఏ రాష్ట్రానికీ రాని పెట్టుబడులు ఇక్కడకు వస్తున్నాయంటే మన విధానాలే అందుకు కారణం కలెక్టర్లుగా మీరు బాగా పనిచేస్తే అది ఆచరణలో కనిపించాలి. అది ప్రజలకు స్పష్టంగా, ప్రభావవంతంగా కనిపించాలి. అలా కాకుండా ఏదో పనిచేశామని 4 సార్లు ప్రెస్ మీట్‌లు పెట్టి చెప్పడం వల్ల ఏం ఉపయోగం? ఇది నాకు కూడా వర్తిస్తుంది. నేను ఇప్పుడు మాట్లాడినదానిపై తర్వాత రివ్యూ చేసుకుంటా. ప్రతి నిమిషం చెక్ చేసుకుంటా. మీరు కూడా పనిచేసిన తర్వాత ఆ ఫలితం ఎలా ఉంది....ప్రజలకు చేరిందా, లేదా.. అనేది సమీక్ష చేసుకోండి."

ప్రభుత్వానికి పేరు తీసుకురావాలి..

"జిల్లాల్లో సానుకూల వాతావరణం ఏర్పడాలంటే అది కలెక్టర్లపైనే ఆధారపడి ఉంటుంది. మంత్రులు ప్లానింగ్ బోర్డు చైర్మన్‌లుగా, రాజకీయ పెద్దలుగా (పొలిటికల్ హెడ్) ఉంటారు. ప్రభుత్వ పనితీరు, ఫలితాలు మంత్రి ద్వారానే జిల్లాలోని ప్రజలకు చేరాలి. బెస్ట్ కలెక్టర్‌గా మీరుండాలి. అలాగే ప్రభుత్వానికి పేరు రావాలి. ఈ రెండూ జరగాలి. లేదంటే, మీరు బాగా పనిచేయవచ్చుగానీ, దానివల్ల ఫలితం ఉండదు. ఓ కంప్యూటర్ చిప్‌లా ఆలోచించాలి. ఒకప్పుడు ఆంధ్ర అంటే రైటాఫ్. ఇప్పుడు ఏపీ అంటే... 'అక్కడ అభివృద్ధి జరుగుతోంది... గూగుల్ వచ్చింది... పరిపాలన బాగుంది... సీఐఐ సమ్మిట్ బాగా జరిగింది... ఇప్పుడిప్పుడే ఓ ప్రభావం కనిపిస్తోంది..' అని అనుకుంటున్నారు. ఏపీ గురించి దేశమంతా మాట్లాడుకోవాలి. ప్రపంచం అంతా మనవైపు చూసే పరిస్థితి రావాలి. ఏపీలో ఏఐ ఉంది. డేటా సెంటర్లు వస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటర్, వాటి ఉత్పత్తి వస్తోంది. స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్, ఏరో స్పేస్ సిటీలు, సెమీకండక్టర్ లు వస్తున్నాయి. ప్రపంచంలో డేటాలేక్ పెట్టి సమాచారాన్ని ఒక్క ఏపీలోనే ఇంటిగ్రేట్ చేయడం జరుగుతోంది."

రోడ్ బ్లాకర్‌గా మారొద్దు

"అభివృద్ధికి అడ్డుగా ఉన్న రోడ్ బ్లాక్‌లను క్లియర్ చేస్తున్నాం. కానీ మీరే రోడ్‌బ్లాక్‌గా తయారు కావొద్దు. సానుకూల దృక్ప?థాన్ని అలవాటు చేసుకోండి. ప్రభుత్వంలో నేను, పవన్ కల్యాణ్, బీజేపీ వ్యక్తిగత ఇష్టాయిష్టాల కంటే పనితీరుతో కూడిన పరిపాలనకే ప్రాధాన్యం ఇస్తాం. మాకు రాగద్వేషాలు లేవు. పారదర్శకత కోసమే కలెక్టర్ల సదస్సును లైవ్ ఇస్తున్నాం. ఇది జిల్లా యంత్రాంగం చూడాలని ఆన్‌లైన్‌లోకి తీసుకున్నాం. రహస్యంగా మీ 26 మందితో మాట్లాడి, మేం 100 మందిమి మిమ్మల్ని ఒత్తిడి చేసే బదులు, పారదర్శకంగా ఉండాలనే లైవ్ ఇస్తున్నాం. వచ్చే జనవరి నుంచి ప్రభుత్వంలో ఫైళ్లన్నీ ఆన్‌లైన్ పరిధిలోకి వస్తాయి. రాబోయేది డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే విధానం. దాని ఆధారంగానే కీలక నిర్ణయాలు ఉంటాయి."

నమ్మకం చేతలతోనే వస్తుంది

"ప్రభుత్వంపై నమ్మకం మాటలతో కాదు, చేతలతోనే వస్తుంది. ఒక వ్యక్తి లేదా కంపెనీ, ప్రభుత్వానికి విశ్వసనీయత ఉంటుంది. దీంతో కాలానుగుణంగా ఓ నమ్మకం వస్తుంది. దాన్ని మనం నెలకొల్పాలి. ఇన్ని పెట్టుబడులు వచ్చాయంటే అది మనపై ఉన్న విశ్వాసంతోనే సాధ్యం అయింది. నమ్మకాన్ని పెంచుకోవాలంటే రైట్‌వర్క్ చేయాలి. తప్పుడు పనులు చేయాల్సిన అవసరం లేదు."

మంత్రులు, కలెక్టర్లకు ఇదే గీటురాయి

"మీ జిల్లాలో ప్రజా సంతృప్తి స్థాయిని చూస్తే మంత్రులుగా మీ నాయకత్వం ఎలా ఉందో తెలిసిపోతుంది. రాష్ట్రంలో అత్యధిక సంతృప్తిస్థాయి పింఛన్‌లపైనే ఉంది. 92%గా నమోదైంది. కలెక్టరుగా ప్రతి వర్గం ప్రజలను, గ్రామాన్ని టచ్ చేయాలి. ప్రభుత్వానికి కావాల్సింది ఫలితాలు. ఈ విషయం అండర్‌లైన్ చేసుకోవాలి. జిల్లాలో పౌరుల సంతృప్తి స్థాయినే కలెక్టర్ పనితీరుకు కొలమానంగా ఉంటుంది. మిగతావేవీ కావు."

# రెవెన్యూ అవస్థలకు తక్షణమే స్వస్తి

ఫైళ్ల పరిష్కారమంటే కిందకు తోసెయ్యడమే!

తన వద్ద లేకుండా ఇతరులకు పంపేస్తున్నారు

దీనివల్లే ప్రజల్లో సంతృప్తి రావడం లేదు

లింక్ ఫైళ్లు కూడా మాయమయ్యాయి

దీంతో రెవెన్యూ శాఖను ట్రాక్ చేస్తున్నాం

ఇక ఫైలుపై ఎవరు ఏం రాసినా తీసివేయలేరు: సీఎం



**నమస్తే హైదరాబాద్ :** అమరావతి, డిసెంబరు 17 రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూలోని దురవస్థలకు ఈ రోజే, తక్షణమే ముగింపు పలకాలని స్పష్టంచేశారు. ఫైళ్ల పెండింగ్‌కు సంబంధించి 'పెండింగ్ పెద్దన్న' శీర్షికన ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫైళ్ల పరిష్కారం తీరుపై సీఎం కలెక్టర్ల సదస్సులో కీలక వ్యాఖ్యలు చేశారు. 'కొన్ని శాఖలు వ్యవస్థాగత లోపాలతో వ్యవస్థను దుర్వినియోగం చేయడం వల్ల కొన్ని సమస్యలు వచ్చాయి. రెవెన్యూ సమస్యలూ అందులో భాగమే. ఫైలు పరిష్కారమంటే.. పై నుంచి కిందకు తోసెయ్యడమే! తన వద్ద ఫైలు లేకుండా వేరేవాళ్లకు పంపించేయడమనే ధోరణికి వచ్చారు. దీంతో రెవెన్యూ సేవలపై ప్రజల్లో సంతృప్తి రావడం లేదు. అందుకే ఇప్పుడు రెవెన్యూలో ఫైల్ సిస్టమ్‌ను ట్రాక్ చేస్తున్నాం. ఎవరు ఏ విధంగా ఫైలు పరిష్కరిస్తున్నారో తెలుసుకుంటున్నాం' అని తెలిపారు. రెవెన్యూలో కీలకమైన లింక్ ఫైళ్లు మాయమయ్యాయని, ప్రస్తుతం ఉన్న విధానంలో ఏ ఫైలు ఎక్కడికి వెళ్లిందో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యవస్థకు ఈరోజే ముగింపు పలకాలని, ఇందుకోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ తీసుకొస్తున్నామని తెలిపారు. 'దీనివల్ల ఫైలుపై ఎవరు ఏం రాసినా అందులో ఉంటుంది. దానిని తీసివేయలేరు. రేపటి రోజు ఆ అధికారి తప్పుచేశారు.. దుర్బుద్ధి ప్రదర్శించారంటే ఆటోమేటిగ్గా తెలిసిపోతుంది' అని చెప్పారు. ప్రభుత్వంలో ఒక శాఖ అద్భుతంగా పనిచేస్తే, మరో శాఖ దాన్ని అందుకోలేకపోతోందన్నారు.గూగుల్‌కు లోకేశ్ బీజం వేశారు..

మంత్రి లోకే శ్ గతంలో ఎప్పుడో అమెరికా వెళ్లినప్పుడే గూగుల్ రాక కోసం విత్తనం వేశారని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రీన్ ఎనర్జీ ఓ సానుకూల అంశమని.. అందుకే గూగుల్ ఆలోచించి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి తో వస్తోందని.. ప్రభుత్వ పట్టుదలకు, పనితీరుకు ఇదే నిదర్శనమన్నారు.

కేంద్రం సీఎస్ఎస్ లెక్కలడిగింది.. కూటమి అధికారంలోకి రాకముందు కేంద్ర ప్రాయోజిత పథకాలు(సీఎస్ఎస్) పనిచేయకుండా పోయాయని సీఎం చెప్పారు. ఈ స్కీములను పునరుద్ధరించి సాయం చేయాలని ఢిల్లీ వెళ్లి కేంద్రాన్ని కోరితే.. తనకో కౌంటర్ విష్‌లిస్టు ఇచ్చారని తెలిపారు. 'మీ దగ్గర సీఎస్ఎస్ స్కీముల అకౌంట్స్ సరిగా లేవు.. మీ రాష్ట్రానికి డబ్బులిచ్చాం.. ముందు వాటికి లెక్కలు చెప్పండి తర్వాత మీ కోరికలపై మాట్లాడదామని కేంద్రం చెప్పింది. వెంటనే ఢిల్లీ నుంచి వచ్చి ఆ పథకాల వివరాలు చూశాం. డబ్బుల్లేవు.. దీంతొ దశల వారీగా క్లియర్ చేసి.. స్కీములను పట్టాలెక్కించాం' అని వెల్లడించారు.

ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని సీఎం చెప్పారు. 'గతంలో ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదు. కానీ మేం వచ్చాక సమస్యలను పరిష్కరించి ఒకటో తేదీనే ఇస్తున్నాం. ఒకవేళ ఆ రోజు సెలవైతే ముందు రోజే ఇస్తున్నాం. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం. కొందరికి ఆరుగురు, ఏడుగురు పిల్లలున్నా ఇస్తున్నాం. వారు భవిష్యత్ దేశభక్తులు. అన్నదాత సుఖీభవలో రెండో దశ చెల్లింపులు చేశాం. దీపం-2, స్త్రీశక్తి. మెగా డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టాం. ఇతర సంక్షేమ పథకాలను కూడా దారిలోకి తీసుకొచ్చాం. సూపర్‌సిక్స్‌పై ప్రజా సంతృప్తిస్థాయి 96 శాతం రావాలి' అని కలెక్టర్లకు సూచించారు.

15 వేలు వస్తున్నా..ఓ వ్యక్తికి రూ.15 వేలు పింఛనుగా వస్తోందని, ఇంకా పెంచాలని తనను కోరారని సీఎం ప్రస్తావించారు. 'మంగళవారం టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి పిటిషన్లు తీసుకుంటుండగా ఓ వ్యక్తి నా వద్దకు వచ్చారు. తనకొస్తున్న పింఛను సరిపోవడం లేదని.. ఇబ్బందులు ఉన్నాయని, ఇంకా పెంచాలని అడిగారు. అందులో తప్పులేదు. అదొక ఆశ. కానీ మనం వారికి నచ్చజెప్పాలి' అని వ్యాఖ్యానించారు.

ఇదీ ప్రభుత్వం అంటే..పోలీసు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే సమావేశంలో జరిగిన సంఘటన గురించి సీఎం ప్రస్తావించారు. 'కానిస్టేబుల్‌గా ఎంపికైన బాబూరావుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడినప్పుడు.. మా ఊరికి రోడ్డులేదని కానిస్టేబుల్ చెప్పారు. ఆ వెంటనే ఆయన డిపార్ట్‌మెంట్‌కు మెసేజ్ చేయగా ఆ ఊరికి రోడ్డు వేయడానికి రూ.3.9 కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు. దీంతో పవ న్ న న్నడిగారు. వెంటనే అక్కడికక్కడే రోడ్డు మంజూరు చేశాం. ఆ మీటింగ్‌లోనే ప్రకటించాం. ఇదీ స్పందన అంటే. బాధ్యత కలిగిన ప్రభుత్వం అంటే ఇదీ' అని అన్నారు. విభిన్న రంగం నుంచి వచ్చినా పవన్ ట్రగుల్ అవుతున్నారని చెప్పారు.

# కూటమి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కలెక్టర్లు నిబద్ధతతో పనిచేయాలన్న పవన్

**నమస్తే హైదరాబాద్ :** కూటమి ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేందుకు జిల్లా కలెక్టర్లు నిబద్ధతతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ దిశగా అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రిగా ఆయన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన 'పల్లె పండుగ 1.0' పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంపై కలెక్టర్లకు అభినందనలు. ఈ కార్యక్రమం కింద గ్రామాల్లో 4,000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, రైతులకు అండగా 22,500 మినీ గోకులాలు, 15,000 నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్‌ను విజయవంతంగా నిర్మించాం" అని తెలిపారు.ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించి, రూ.4,330 కోట్ల వేతనాలు చెల్లించామని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనిచ్చిందని వివరించారు.మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన 'అడవి తల్లి బాట' కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అటవీ అనుమతుల విషయంలో పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల కలెక్టర్లు అద్భుతమైన పనితీరు కనబరిచారని అభినందించారు. ముఖ్యంగా, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ 100 శాతం అనుమతులు సాధించడంపై



ప్రశంసలు కురిపించారు.పంచాయతీరాజ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే 'రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్' (%=+ూూ%)లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచేందుకు పన్నుల వసూళ్లను డిజిటలైజ్ చేయడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్‌లో ఒక యూనిట్‌తో ప్రారంభమైన 'స్వచ్ఛ రథం' కార్యక్రమం నేడు 25 యూనిట్లకు చేరి సత్ఫలితాలనిస్తోందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్లకు సూచించారు.

# కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను యజ్ఞంలా పూర్తి చేశారని అనితకు నారా లోకేశ్ ప్రశంస

**నమస్తే హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనితపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. తాను యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను హోంమంత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ఒక యజ్ఞంలా పూర్తి చేశారంటూ మంత్రి అనితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.యువగళం పాదయాత్రలో కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నా హామీని నెరవేర్చేందుకు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఒక యజ్ఞంలా చేపట్టి పూర్తి చేసిన గౌరవ హోం మంత్రి వంగలపూడి అనిత గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు వేసిన కుట్రపూరిత కేసులను అత్యంత చాకచక్యంగా పరిష్కరించడం వెనుక అధికార యంత్రాంగానికి హోంమంత్రి గారు పూర్తి సహాయ, సహకారాలు అందించారు. సీఎం గారు, డిప్యూటీ సీఎం గారి చేతుల మీదుగా కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హోం మంత్రి గారికి, అధికార, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# స్త్రీనిధి రుణాల చెల్లింపు కోసం ప్రత్యేక యాప్,,,,ఇంటి వద్ద నుంచే లోన్ చెల్లింపులు



తెలంగాణ రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరీ ముఖ్యంగా మహిళా సంఘాలకు లోన్ల రూపంలో భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందజేస్తూ వారు ఆర్థికంగా ఎదగడానికి మద్దతు అందజేస్తోంది. వారికి సాధారణ రుణాలతో పాటు అత్యవసర సమయంలో ఆదుకోవడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి స్త్రీనిధి పేరుతో ప్రత్యేకంగా లోన్ ఇస్తోంది. దీని కింద అర్హులైన మహిళలకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లోన్లు ఇస్తోంది.

బ్యాంకులు ఇలా ఇచ్చిన లోన్లను సరిగా చెల్లించడంలో మహిళా సంఘాల సభ్యులు ముందు వరుసలో ఉంటున్నారని ప్రభుత్వ అధికారులే చాలా సందర్భాల్లో తెలిపారు. చాలా తక్కువ శాతం మంది ఈ లోన్లను చెల్లించలేకపోతున్నారు. గ్రూపుల్లో ఉన్న సభ్యుల్లో కొందరు సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడం వల్ల మిగతా వారు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అయితే కొందరు బ్యాంకులకు వెళ్లేంత తీరిక లేకనో.. మరే ఇతర కారణాల వల్లనో లోను ఈఎంఐ చెల్లించడానికి గ్రామ స్థాయిలో గ్రామదీపికలను.. పట్టణాల్లో అయితే ఆర్పీలకు ఇస్తున్నారు. అయితే కొంత మంది సిబ్బంది వాటిని తమ సొంతానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా స్త్రీనిధి లోన్ల చెల్లింపు అంశంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. స్త్రీనిధి సిబ్బంది, సీఆర్పీలు మహిళా సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి లోన్ల బకాయి విషయం అడిగే వరకు సంఘం సభ్యులకు తెలియడం లేదు. ఈ క్రమంలో ఇలాంటి మోసాలను అరికట్టడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇలాంటి మోసాలను అరికట్టడం కోసం 'మన స్త్రీనిధి' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఈ యాప్‌లో సంఘ సభ్యుల వివరాలతో పాటు వారు స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు, చెల్లింపుల వివరాలు అందుబాటులో ఉంటాయి. దీని ద్వారానే లోన్ చెల్లింపు చేసుకునే అవకాశం ఉంది. దీని కోసం ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌కి వెళ్లి 'మన స్త్రీనిధి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఆ సంఘం సభ్యుల వివరాలు కనిపిస్తాయి. అలానే వీరు గతంలో ఎంత లోన్ తీసుకున్నారు.. ఇప్పటి వరకు ఎంత చెల్లించారు.. ఇంకా ఎన్ని నెలలు చెల్లించాలి అనే వివరాలు దీనిలో కనిపిస్తాయి.

ఫోన్ నంబర్ అప్‌డేట్ చేయకపోతే.. సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి విషయం చెప్పి అప్‌డేట్ చేయించుకోవాలి. ఈఎంఐ కట్టాలనుకునేవారు.. ఎవరికీ డబ్బులు ఇవ్వకుండా ఫోన్ యాప్‌లో మనస్త్రీనిధి తెలంగాణ అని టైప్ చేస్తే .. చెల్లించాల్సిన నెల వాయిదా మొత్తం కనిపిస్తోంది. ఇలా సులభంగా ఇంటి వద్ద నుంచే చెల్లింపులు చేసుకోవచ్చు.

# అంగన్వాడీ టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్ల పంపిణీ..

అంగన్వాడీ సేవలను మరింత పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంది..
-నందిగామ ఎమ్మెల్యే తాంగిరాల సౌమ్య





**నమస్తే హైదరాబాద్ :**కాకాని నగర్‌లో బుధవారం నాడు ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐ సి డి ఎస్) శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నేతలు మరియు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ స్మార్ట్ ఫోన్లను అందిస్తున్నదని తెలిపారు. ఈ ఫోన్లలో పోషణ ట్రాకర్ మరియు బాల సంజీవిని యాప్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ వివరాలు, సేవల అమలు స్థితిని అంగన్వాడీ టీచర్లు నేరుగా నమోదు చేయవచ్చని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న ప్రతి కార్యక్రమం డిజిటల్‌గా నమోదు కావడం వల్ల పనితీరులో నాణ్యత పెరగడంతో పాటు ప్రభుత్వానికి తక్షణ సమాచారం అందుతుందని, దీని ద్వారా సేవలలో జవాబుదారీతనం మరింత మెరుగుపడుతుందని ఆమె వివరించారు. బాలల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీ భార్గవి, ఐసిడిఎస్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లు...

ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.



**నమస్తే హైదరాబాద్ :** మహిళా కానిస్టేబుల్స్ గా ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. జి.కొండూరు మండలంలోని వెల్లటూరు శివారు భీమవరప్పాడు గ్రామానికి చెందిన వంగూరు చిట్టిబాబు భవానిపురం పోలీస్ స్టేషన్ లో గత 35 ఏళ్లుగా హెూంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇరువురు కుమార్తెలు రత్నశ్రీ, జయశ్రీలు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు అర్హత సాధించి నియామక పత్రాలు పొందారు. వీరు బుధవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదును ఇబ్రహీంపట్నంలో ప్రత్యేకంగా కలిశారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. వారు భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ పరిధిలోని 82 వేల ఎకరాల ఏపీఐఐసీ భూములపై కీలక ఆదేశం

**నమస్తే హైదరాబాద్ :**రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూముల కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా పారిశ్రామిక పెట్టుబడులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఏపీఐఐసీకి చెందిన సుమారు 82 వేల ఎకరాల భూమి 22ఏ పరిధిలో ఉండటం వల్ల పెట్టుబడులకు ఆటంకంగా మారిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి, ఆ 82 వేల ఎకరాల భూమికి సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి చట్టపరమైన, సాంకేతిక ఇబ్బందులు లేకపోతే, ఆ భూములను 22ఏ పరిధి నుంచి తప్పించేందుకు కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. భూ కేటాయింపుల్లో పర్యాటక రంగానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత ఐటీ కంపెనీలకు కేటాయించాలని చంద్రబాబు సూచించారు.గత 18 నెలల్లో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి రూ.8.55 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, కొన్ని ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణ పనులు కూడా ప్రారంభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. భూ కేటాయింపుల్లో కలెక్టర్లు చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విజయవాడ, విశాఖపట్నంలలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సౌర,



పవన, పంప్డ్ స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూ కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. విశాఖ, తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా హెూటళ్లు, టూరిజం ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పొలంపల్లి విద్యార్థులు ఎంపిక



**నమస్తే హైదరాబాద్ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలంపల్లికి చెందిన విద్యార్థులు అల్లు దేవి శ్రీ, టీ. రాజశేఖర్ 44 వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొక్కిరిగడ్డ జ్యోతి బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ 19వ తేదీ నుండి21 వరకు ప్రకాశం జిల్లా జే పంగులూరు గ్రామంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు కొక్కిరిగడ్డ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అందరూ నిత్యం వ్యాయామం, ఆటలు ఆడటం వలన శారీరక కండర శక్తితో పాటు మేధో శక్తి కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ధనాల రాజ్ కుమార్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ జి. నాగమణి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ డి. రాజా, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

## పవన్ కళ్యాణ్ స్ట్రగుల్ అవుతున్నాడు.. చంద్రబాబు





**నమస్తే హైదరాబాద్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురించి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమరావతిలోని సచివాలయం 5వ బ్లాక్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల 5వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్?తో పాటుగా ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు నాయుడు.. పవన్ కళ్యాణ్ గురించి ఇంట్రస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ వేరే ఫీల్డ్ నుంచి రాజకీయాల్లోకి వచ్చి స్ట్రగుల్ అవుతున్నారని.. అయినా మంచిగా పనిచేస్తున్నారని మెచ్చుకున్నారు. మంగళగిరిలో జరిగిన కానిస్టేబుల్ నియామక పత్రాల ప్రదానోత్సవంలో జరిగిన ఘటనను చంద్రబాబు ఈ సందర్భంగా ఉదహరించారు.“ మిత్రుడు పవన్ కళ్యాణ్ డిఫరెంట్ ఫీల్డ్ నుంచి వచ్చి స్ట్రగుల్ అవుతున్నాడు. అయినా బ్రహ్మాండంగా పనిచేస్తున్నారు. నిన్ననే చూశారు. అదో ఉదాహరణ. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న కోరికను నెరవేర్చాం. ఎన్నో పిటిషన్లు, రిట్లు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ.. 31 కేసులు పరిష్కరించి నిన్న (మంగళవారం) వారికి ( కానిస్టేబుల్ నియామక పత్రాలు) ఉద్యోగాలు ఇచ్చాం. డీఎస్సీ విషయంలోనూ ఇదే గందరగోళం చేశారు. నిన్న మీటింగ్‌లో బాబూరావు అనే కానిస్టేబుల్ ఓ రిక్వెస్ట్ చేశాడు. నాకు ఉద్యోగం వచ్చింది.. మా ఊరికి రోడ్డు వేయించండి సార్.. అని కోరాడు. పంచాయతీరాజ్ శాఖ పవన్ కళ్యాణ్ పరిధిలో ఉండటంతో నేను ఆయనను కోరా. ఆయన వెంటనే అధికారులను ఆదేశించి అంచనా వ్యయం రూపొందించి మీటింగ్‌లోనే ప్రకటించాం. అది బాధ్యతగల ప్రభుత్వం పనిచేసే తీరు. అదీ ప్రొయాక్టివ్ గవర్నెన్స్..” అంటూ చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.మరోవైపు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించిన పవన్ కళ్యాణ్.. 2014లో జనసేన పార్టీని స్థాపించారు. అయితే నాటి ఎన్నికల సమయంలో టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతుగా నిలిచిన పవన్ కళ్యాణ్.. ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత వివిధ కారణాలతో 2019 ఎన్నికల్లో ఈ రెండూ పార్టీలకూ దూరం జరిగిన పవన్ కళ్యాణ్.. జనసేన పార్టీని ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిపారు. అయితే పవన్ కళ్యాణ్ పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోవటంతో పాటుగా.. జనసేన పార్టీ కేవలం ఒక్క సీటుకే పరిమితమైంది.ఇక 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి బరిలోకి దిగగా.. ఎన్డీఏ కూటమి ఏకంగా 164 చోట్ల గెలుపొందింది. జనసేన పార్టీ పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 లోక్ సభ స్థానాల్లోనూ గెలిచి వందశాతం స్ట్రైక్ రేట్ సాధించింది. ఆ తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సినీ నేపథ్యం నుంచి వచ్చిన పవన్ కళ్యాణ్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని నిలబడ్డారనే ఉద్దేశంతో చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు.

## 18 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు మంచి ఛాన్స్.... లక్షల్లో జీతం

**నమస్తే హైదరాబాద్ :** నర్సింగ్ కోర్సులు చదివినవారికి జర్మనీ ఆహ్వానం పలుకుతోంది. నర్సింగ్ కోర్సులు పూర్తిచేసి.. జర్మన్ భాష వచ్చిన వారికి ఆ దేశంలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. అలాగే ఆకర్షణీయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పిస్తున్నాయి. జర్మనీలోని వృద్ధుల అవసరాలకు అనుగుణంగా వారికి సేవలు అందించేందుకు నర్సులు లేకపోవటంతో.. జర్మనీలో నర్సులకు మంచి డిమాండ్ ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ.. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటోంది. రాష్ట్రంలోని నర్సింగ్ విద్యార్థులు జర్మనీలో ఉద్యోగావకాశాలు పొందేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం వంటి కోర్సులు చదువుతున్న వారికి.. జర్మన్ భాషను సైతం నేర్పించే కార్యక్రమాలు మొదలుపెట్టింది.

ఈ క్రమంలోనే విశాఖపట్నం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కీలక ప్రకటన విడుదల చేసింది. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు చేసిన ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందిన మహిళలు ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వయసు 18 నుంచి 40 ఏళ్లలోపు ఉండాలని వెల్లడించింది. ఆసక్తిగల వారికి ఆరు నెలలు జర్మన్ భాషలో ట్రైనింగ్ ఇస్తామని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. మధురవాడ పరదేశీపాలెంలో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల హాస్టల్‌లో ట్రైనింగ్, వసతి ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అనంతరం.. వారికి జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. జీతం కూడా నెలకు రూ.2.40 లక్షల నుంచి రూ.3.10 లక్షల వరకూ ఉంటుందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9030108030 ఫోన్ నంబర్ సంప్రదించాలని సూచించారు. మరోవైపు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగం చేసేందుకు.. జర్మన్ భాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 వంటి స్థాయిలలో ప్రావీణ్యం సాధించాలి. ఎందుకంటే జర్మనీ వీసా పొందాలంటే కనీసం బీ1 సర్టిఫికెట్ ఉండాలి. వీటిని దృష్టిలో పెట్టుకుని నర్సింగ్ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ జర్మనీ భాషను నేర్పిస్తోంది. అయితే నర్సింగ్ కోర్సులు చేసిన వారికి జర్మనీలో ఉద్యోగాలు అంటూ కొన్ని కంపెనీలు కూడా మోసపూరిత ప్రకటనలు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థల ద్వారా ట్రైనింగ్ తీసుకోవటం ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు.



## మార్చి నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్లు 18న విడుదల

**నమస్తే హైదరాబాద్ :** తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం 2026 మార్చి నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను డిసెంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల టికెట్లను ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తారు. భక్తులు ఈ సేవల కోసం రేపటి నుంచి డిసెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు డిసెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.ఇతర సేవల టికెట్లను కూడా పలు తేదీల్లో విడుదల చేయనున్నారు. డిసెంబర్ 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను అందుబాటులో ఉంచుతారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు.డిసెంబర్ 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.ఇక రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను డిసెంబర్ 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో వసతి గదుల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ తేదీలను గమనించి, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# డాక్టర్ మువ్వా కొండయ్య తో ఆంధ్ర అబ్బాయి, అమెరికా అమ్మాయి



**నమస్తే హైదరాబాద్ :** వలేటివారిపాలెంఆంధ్ర అబ్బాయి ,అమెరికా అమ్మాయి వివాహం చేసుకొని ఒకటి అయ్యారు వారి బంధువులను చూడడానికి కందుకూరు వచ్చారు .కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం మండలం అత్తింటి వారి పాలెం గ్రామానికి చెందిన కంచర్ల వెంకటకృష్ణారావు మువ్వా శాంతి రోహిణి పెద్ద కుమారుడు కంచర్ల కౌశిక్ అమెరికాకు చెందిన బాట్కిన్స్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు .అమెరికాలో నివాసం ఉండే వెంకట కృష్ణారావు శాంతి రోహిణిల పెద్ద కుమారుడు కౌశిక్ అమెరికాలో ఎయిర్ ఫోర్స్ కెప్టెన్ . బ్యాట్కిన్స్ కూడా ఎయిర్ కోర్సులో కెప్టెన్. వీరిద్దరూ ఉద్యోగం చేసే చోట ప్రేమించుకున్నారు .పెద్దలకు వారి ప్రేమ విషయం చెప్పి ఒప్పించి వివాహం చేసుకున్నారు. కృష్ణారావు శాంతి రోహిణలు అమెరికా సిటిజనులుగా కొనసాగుతున్నారు. అమెరికా అమ్మాయిని వివాహం చేసుకున్న కంచర్ల కౌశిక్ కందుకూరిలో ఉన్నవారి తాత అయిన ప్రముఖ హెూమియో వైద్యులు సిపిఎం సీనియర్ నాయకులు డాక్టర్ మువ్వా కొండయ్య గారి దగ్గర బాల్యంలో ఉన్నాడు .ఆ తర్వాత తల్లిదండ్రులు నివాసం ఉంటున్న అమెరికాలోని చికాగో వెళ్లి అక్కడే ఉంటున్నాడు .అమెరికా దేశంలో ఎయిర్ ఫోర్స్లో ఉద్యోగం చేస్తూ కౌశిక్ అమెరికా అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు .వారి బంధువులను కుటుంబ సభ్యులను చూడడానికి కౌశిక్ దంపతులు రెండు రోజుల క్రితం కందుకూరు వచ్చారు. కందుకూరు కు చెందిన ప్రముఖ హెూమియో వైద్యులు డాక్టర్ మువ్వా రవీంద్ర కుమార్ కి స్వయాన మేనల్లుడు .కందుకూరు లోనిడాక్టర్ మువ్వా కొండయ్య ఇంటికి వచ్చిన అమెరికా అమ్మాయి ఆంధ్ర అబ్బాయిని పలకరించిన విలేకరులకు మహానందంతో వారి వివరాలను పంచుకోవడం విశేషం కౌశిక్ సతీమణి కూడా కందుకూరు విషయాలను ఆసక్తిగా తన భాషలో భర్తచెపుతుంటే వింటూ సమాధానం చెప్పటం కనిపించింది తని తండ్రి స్వగ్రామమైన అత్తింటి వారి పాలెం కికూడా వెళ్లి అక్కడివారిని పలకరించి రావడం జరిగింది.

# హౌస్ మెరిట్ అవార్డ్ ప్రోగ్రామ్



**నమస్తే హైదరాబాద్ :** , పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డు లో ఉన్న వి ఆర్ ఆక్స్ఫర్డ్ ఒలింపియాడ్ పాఠశాలలో హౌస్ మెరిట్ అవార్డ్ ప్రోగ్రామ్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను నాలుగు హౌస్లుగా (రెడ్ బ్లూ గ్రీన్ , ఎల్లో విభజించి పోటీలను నిర్వహించారు. విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు నైపుణ్యాన్ని పెంపొందించడానికి 'కరిక్యులం సిస్టమ్' అమలులో భాగంగా ప్రతి నెల ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర్ రావు మాట్లాడుతూ..విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగడం వల్ల ఇంగ్లీష్ భాషపై పట్టు వస్తుందని,తద్వారా సాఫ్ట్‌వేర్ రంగంలో అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మల్టీనేషనల్ కంపెనీలు ఇంగ్లీష్‌ను ప్రధాన భాషగా గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు.

డైరెక్టర్ జి.బాలభాస్కర రావు మాట్లాడుతూ..

గ్లోబలైజేషన్ యుగంలో ఇంగ్లీష్ కేవలం ఒక సబ్జెక్టు మాత్రమే కాదని,అది ప్రపంచాన్ని కలిపే ఒక శక్తివంతమైన వారధి అని అభివర్ణించారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక రంగాలలో జ్ఞానాన్ని పొందడానికి ఇంగ్లీష్ తప్పనిసరి అని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గోకాఫ్ 120 ఎం.ఎల్. నూతన ప్యాక్ మార్కెట్‌లోకి విడుదల

**నమస్తే హైదరాబాద్ :** నాలుగు దశాబ్దాలకుపైగా ఘనచరిత్ర కలిగిన, ఆరోగ్య పరిరక్షణ రంగంలో ప్రసిద్ధి గాంచిన కంపెనీచే తయారుచేయబడిన ఫిజికెమ్ వారి గోకాఫ్ ఇప్పుడు మార్కెట్‌లో 120 ఎం.ఎల్. ప్యాక్‌తో అందుబాటులోకి వచ్చిందని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీసీ కేశవరావ్ తెలిపారు. గోకాఫ్ 120 ఎం.ఎల్. బాటిల్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ రోడ్డు
టిక్కిల్ రోడ్డులలోని హెూటల్ మానర్ ఫుడ్ ప్లాజాలో బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ కేశవరావ్ మాట్లాడుతూ, గోకాఫ్ గత 20 ఏళ్ళుగా దక్షిణ భారతదేశం వ్యాప్తంగా మార్కెటింగ్ చేయబడుతుందన్నారు. ప్రస్తుతం 120 ఎం.ఎల్. ప్యాక్‌తో ఆవిష్కరించిన బాటిల్‌లో 20 ఎం.ఎల్. కన్స్యూమర్‌కి లైఫ్ టైం ఆఫర్ ఇస్తున్నామన్నారు. దక్షిణాధి రాష్ట్రాల్లో దిగ్విజయంగా మార్కెట్ పూర్తిచేసిన అనంతరం రాబోయే 2026లో సంపూర్ణంగా భారతదేశానికి విస్తరించే ఆలోచనలో కంపెని యాజమాన్యం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కాలేజ్ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి మాట్లాడుతూ, ఇటీవల రెండేళ్ళ నుండి ఎల్లోపతి కాఫ్ సిరఫ్ వాడడం వల్ల ఏర్పడిన దుష్పరిణామాలు నివారించాలంటే ఆయుర్వేద విధానంలో తయారుచేయబడిన గోకాఫ్ సిరఫ్ వాడడం అత్యంత రక్షణ అని తెలిపారు. ఆవిష్కరణలో పాల్గొన్న ఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, బాలివుట్ నటీమణి నైనా గంగూలి మాట్లాడుతూ, గోకాఫ్ పూర్తిగా




ఆయుర్వేదంతో కూడుకుందని, హైలి ఎఫెక్టీవ్ అండ్ 100 శాతం సేఫ్ అని తెలిపారు.....

# చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందాలి..ఎమ్మెల్యే నాగేశ్వరరావు




**నమస్తే హైదరాబాద్ :** అంగన్వాడి టీచర్లు వర్కర్లకు ప్రభుత్వం అందిస్తున్న అధునాతన 5జి ఫోన్లను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పంపిణీ చేశారు. కందుకూరు ప్రాజెక్ట్ పరిధిలో 154 మంది, ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలో 184 మందికి ఫోన్లు స్వయంగా అందించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పౌష్టిక ఆహారం సక్రమంగా అందేలా అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బందికి తల్లికి వందనం పథకం అమలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఆలోచన చేస్తున్నారని అన్నారు. అంగన్వాడి టీచర్లకు గ్రాట్యుటీని 20వేల నుంచి లక్ష రూపాయలకు, వర్కర్లకు 20వేల నుంచి 40 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే సరుకులు, స్టాకు, ఖర్చులు, అటెండెన్స్ వివరాలన్నీ ఇకనుంచి ఫోన్లలోనే నమోదు చేయాల్సి ఉంటుందని సిబ్బందికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా తమకు ఇస్తున్న 11,500 రూపాయల జీతం సరిపోవడంలేదని, జీతం పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని వర్కర్లు ఆయననుకోరారు.ఈ కార్యక్రమంలో కందుకూరు సిడిపిఓ ఉషారాణి, ఉలవపాడు మండల సిడిపిఓ మాధవి లత, అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

# వైయస్ జగన్మోహన్ రెడ్డికి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన.. షేక్ గయాజ్

## (కనిగిరి నియోజకవర్గం ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు)



**నమస్తే హైదరాబాద్ :** తాడేపల్లి వైసిపి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ గయాజ్ మర్యాద పూర్వకంగా కలిసి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జస్ట్ స్కాన్ చేస్తే చాలు....రేషన్ దుకాణాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్

**నమస్తే హైదరాబాద్ :** పేద కుటుంబాలకు తక్కువ ధరకు నిత్యావసరాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చౌక దుకాణాలు (రేషన్ షాపులు) ఏర్పాటు చేసింది. రేషన్ దుకాణాల ద్వారా మధ్య తరగతి జీవులకు రాయితీపై కందిపప్పు. బియ్యం, రాగులు, జొన్నలు, పామాయిల్, చక్కెర వంటి నిత్యావసర సరుకులను ప్రతి నెలా అందిస్తోంది. అయితే రేషన్ దుకాణాల్లో అక్రమాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో.. రేషన్ పంపిణీలో పారదర్శకత కోసం ఏపీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు కూడా తీసుకువచ్చింది. విడతల వారీగా రాష్ట్రవ్యాప్తంగా బియ్యం కార్డుదారులకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందించింది. క్యూఆర్ కోడ్ ముద్రించి ఉండే ఈ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలు తెలుసుకోవటంతో పాటుగా.. రేషన్ పంపిణీలో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుతుంది.

అలాగే ఏపీ ప్రభుత్వం మరో కీలకమైన ఏర్పాటు కూడా చేసింది. రేషన్ దుకాణాల్లో ఏవైనా అక్రమాలు జరుగుతున్నట్లు ప్రజలు గుర్తిస్తే.. అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఓ ఏర్పాటు కూడా చేసింది. అందులో భాగంగా ప్రతి రేషన్ షాపు వద్ద కూడా.. క్యూఆర్ కోడ్‌తో కూడిన ఓ ప్రత్యేకమైన బోర్డు ఏర్పాటుచేయిస్తోంది. ఈ బోర్డు మీద ఆ రేషన్ దుకాణం డీలరు పేరుతో పాటుగా రేషన్ దుకాణం సంఖ్య, ఆ ఊరు పేరు, ప్రాంతం, మండలం పేర్లను కూడా పొందుపరిచింది. అలాగే బోర్డు మీద ఆ క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయిస్తోంది. రేషన్ కార్డుదారులు.. రేషన్ దుకాణంలో ఏవైనా అక్రమాలు గుర్తిస్తే.. ఉదాహరణకు తూకాల్లో తేడాలు, రేషన్ సరుకులు సక్రమంగా అందించకపోవటం వంటివి గుర్తిస్తే వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. అలాగే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి పలు వివరాలను కూడా సేకరిస్తోంది. ప్రశ్నల రూపంలో అడిగి సమాధానాలు, అభిప్రాయాలు సేకరిస్తోంది. రేషన్ దుకాణంలో ఈ



నెల సరుకులు తీసుకున్నారా.. సరుకుల నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా అనే ప్రశ్నలు అడుగుతారు.అలాగే రేషన్ డీలర్ సరుకులను సరైన తూకంతోనే అందిస్తున్నారా, రేట్లు ఎక్కువగా తీసుకుంటున్నారా.. మర్యాద పూర్వకంగా ఉన్నారా అనే ప్రశ్నలు అడుగుతారు. వీటికి లబ్ధిదారులు అవును లేదా.. కాదు అనే సమాధానాలు అందించాల్సి ఉంటుంది. ఇవి పూర్తి చేసిన తర్వాత.. సెల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేస్తే మన అభిప్రాయాలు అధికారులకు చేరతాయి. ఈ విధంగా వచ్చే ఫిర్యాదులపై ఆ తర్వాత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

# ముంచెత్తుతున్న పొగమంచు..!

**నమస్తే హైదరాబాద్ :** విశాఖపట్నం, డిసెంబరు 17 అసలే చలికాలం.. ఆపై పొగమంచు.. దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతోంది..! సాధారణంగా డిసెంబరు నెలాఖరు నుంచి జనవరి/ఫిబ్రవరి నెలల్లో కురిసే పొగమంచు ఈ ఏడాది ముందుగానే... అది కూడా దట్టంగా కురవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా రవాణా వ్యవస్థపై ఇది అధిక ప్రభావం చూపుతోంది. తెల్లవారుజామున మూడు/నాలుగు గంటల నుంచి ఉదయం పది గంటల వరకూ పొగమంచు కమ్మేయడంతో జనజీవనం స్తంభిస్తోంది. పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అధికపీడనం, వర్షాలు కురిసేలా వెస్టన్ డిస్ట్రబెన్స్‌లు బలహీనంగా మారడం, తూర్పుగాలుల ప్రభావం లేకపోవడం, స్థిరమైన వాతావరణ పరిస్థితులు నెలకొనడం వల్ల పొగమంచు దట్టంగా కురుస్తోందని వాతావరణ నిపుణుడొకరు విశ్లేషించారు. ఇంకా అనేక ప్రాంతాల్లో గడ్డకట్టేలా చలి కొనసాగడంతో పొగమంచు తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. కొద్దిరోజులుగా దేశం మొత్తం అధికపీడనం (యాంటీ సైక్లోన్) నెలకొని ఉంది. శీతాకాలంలో వాయవ్య భారతంలో మాత్రమే నెలకొనే అధికపీడనం ఈ ఏడాది దేశంలో అనేక ప్రాంతాలకు విస్తరించింది. అందువల్ల ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు, తూర్పు భారతం నుంచి పశ్చిమ భారతం వరకూ అనేక ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా ఉంటోంది. పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండడం.. రాత్రి పూట భూమి వేగంగా చల్లబడడంతో అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తోంది. దీనికి వాతావరణంలోని కాలుష్యం తోడవడంతో అనేక ప్రాంతాల్లో పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిలో ప్రధానంగా ఢిల్లీ, హరియాణా, ఉత్తరప్రదేశ్‌తోపాటు దేశంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నగరాలు, పట్టణాల్లో పొగమంచు కురుస్తోందని పేర్కొంటున్నారు. అధిక పీడనం ప్రభావంతోపాటు తూర్పుగాలులు, వెస్టన్ డిస్ట్రబెన్స్‌లు బలహీనంగా ఉండడంతో పొగమంచు కురుస్తోందని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. కొన్నిచోట్ల బుధవారం విజిబిలిటీ 500 మీటర్ల కంటే తక్కువకు పడిపోయిందని పేర్కొన్నారు. బలమైన వెస్టన్ డిస్ట్రబెన్స్ సంభవిస్తే ఉత్తరాది నుంచి మధ్యభారతం వరకూ దాని ప్రభావం కొనసాగి వర్షాలు కురుస్తాయని, అలాంటప్పుడు పొగమంచు తక్కువగా కురుస్తుందని పేర్కొన్నారు.

జి.మాడుగులలో 5.4 డిగ్రీలు రాష్ట్రంలో బుధవారం అనేక ప్రాంతాల్లో చలి ప్రభావం కొనసాగింది. పొగమంచు దట్టంగా కురిసింది. విశాఖ ఎయిర్‌పోర్టులో బుధవారం ఏడు గంటలకు విజిబిలిటీ 800 మీటర్లకు పడిపోయింది. ఏజెన్సీలో విజిబిలిటీ 200 మీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 5.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

# ధర్మవరం లో దివ్యాంగుల సమస్యలపై అవగాహన సదస్సు

**నమస్తే హైదరాబాద్ :** ధర్మవరం టౌన్ నందు దివ్యాంగుల సమస్యల పరిష్కారం, హక్కులపై అవగాహన కల్పించేందుకు సక్షమ్ ధర్మవరం శాఖ – శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి గారి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, దివ్యాంగులు గౌరవంగా జీవించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ముఖ్యంగా పెన్షన్లు, వైద్య సహాయం, ఉపాధి అవకాశాలు, గుర్తింపు కార్డులు, రవాణా సౌకర్యాలు వంటి అంశాల్లో ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు.

# సినిమా



## అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన కథతో సినిమా చేసిన ఆ టాలీవుడ్ హీరో..

చాలా మంది హీరోల్లాగే అల్లు అర్జున్ కూడా కొన్ని సినిమాలను రిజెక్ట్ చేశాడు. డేట్స్ అడ్జెస్ట్ అవ్వకపోవడమో, స్టోరీ సూట్ కాకపోవడమో, కథ నచ్చకపోవడమో.. ఇలా వివిధ కారణాలతో బన్నీ వదిలేసిన సినిమాలు చాలా నే ఉన్నాయి. అందులో కొన్ని బ్లాక్ బస్టర్స్ అవ్వగా కొన్ని బాక్స్ ఆఫీస్ దగ్గర బోల్తా పడి అల్లు అర్జున్ జడ్జ్ మెంట్ కరెక్ట్ అని నిరూపించాయి. అలా అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన ఒక సినిమాతో ఒక క్రేజీ హీరో సూపర్ సక్సెస్ ని సాధించాడు. వివరాల్లోకి వెళితే.. విక్రమ్ కే కుమార్ కు ట్యాలెంటెడ్ డైరెక్టర్ గా పేరుంది. 13 బి, 24, మనం వంటి ఎన్నో సూపర్ హిట్ సినిమాలను తెరకెక్కించారు విక్రమ్ కే కుమార్. అలాగే యూత్ స్టార్ నితిన్ కు 'ఇష్క్' రూపంలో బ్లాక్ బస్టర్ కూడా ఇచ్చారు. అయితే ఈ సినిమాకు హీరోగా నితిన్ ఫస్ట్ ఛాయిస్ కాదట. విక్రమ్ కే కుమార్ అల్లు అర్జున్ తో ఈ సినిమా చేద్దామనకున్నాడట. బన్నీకి కథ కూడా చెప్పాడట. అయితే అప్పటికే అల్లు అర్జున్ చేతిలో పలు సినిమాలు ఉండడంతో ఇష్క్ సినిమాపై పెద్దగా ఆసక్తి చూపించలేదట. దీంతో ఆ మూవీ ని నితిన్ తో చేసి సూపర్ సక్సెస్ కొట్టారు విక్రమ్ కే కేమార్.. ఈ సినిమాతోనే 13 ఫ్లాప్ సినిమాలకు చెక్ పెడుతూ సూపర్ సక్సెస్ అందుకున్నాడు హీరో నితిన్.

కేవలం ఇష్క్ ఒక్కటే కాదు వివిధ కారణాలతో అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ మూవీస్ కూడా ఉన్నాయి. జయం, భద్ర, బొమ్మరిల్లు, 100 % లవ్, అర్జున్ రెడ్డి, పండగ చేస్కో, నాని గ్యాంగ్ లీడర్ సినిమాలు కూడా మొదట అల్లు అర్జున్ దగ్గరకే వచ్చాయట. అయితే వివిధ కారణాలతో బన్నీ వాటిని వద్దనుకున్నాడట. ప్రస్తుతం అట్లీ కుమార్ దర్శకత్వంలో ఓ పాన్ వరల్డ్ మూవీ చేస్తున్నాడు అల్లు అర్జున్. ఈ పాన్ వరల్డ్ మూవీలో బాలీవుడ్ అందాల తార దీపికా పదుకొణె హీరోయిన్ గా నటిస్తోంది. సుమారు 800 కోట్ల భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తోంది సన్ పిక్చర్స్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. గార్డియన్ ఆఫ్ ది గెలాక్సీ తరహాలో హాలీవుడ్ లెవెల్ లో ఈ మూవీ తెరకెక్కనుందని సమాచారం.





## బాబోయ్ వీరికి ?బొప్పాయి వెరీ డేంజర్..!

బొప్పాయిలో పపైన్ ఉంటుంది. బొప్పాయి తినడం వల్ల గర్భధారణ సమయంలో గర్భాశయంలో సంకోచాలు ప్రారంభమవుతాయి. ఇవి సమయానికి ముందే ప్రసవానికి కారణమవుతాయి. కొన్నిసార్లు గర్భస్రావానికి దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుత రోజుల్లో చాలా మంది లేటెక్స్ అలెర్జీ సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారు బొప్పాయికి దూరంగా ఉండాలి. ఒకవేళ తింటే అలర్జీ వచ్చే అవకాశం ఉంది. దాంతో దద్దుర్లు, తుమ్ములు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది , శరీరంలో వాపు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.బొప్పాయిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది కాబట్టి కడ్నీల్లో రాళ్లు ఉన్నవారు తినకపోవడం మంచిది. ఒకవేళ తింటే కిడ్నీల్లో రాళ్ల పరిమాణం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి బొప్పాయి అవాయిడ్ చేయడం మంచిది. బొప్పాయి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహకరిస్తుంది. అయితే ఏదైనా గుండె జబ్బుతో బాధపడేవారు మాత్రం బొప్పాయి తినకపోవడం మంచిది. ఎందుకంటే బొప్పాయిలో హృదయ స్పందనలు సక్రమంగా ఉండకుండా చేసే కొన్ని పదార్థాలు ఉంటాయి.

బొప్పాయి షుగర్ రోగులకు ఎంతో ఉపయోగకరం. అయితే చక్కెర స్థాయి తక్కువగా ఉన్నవారు లేదా హైపోగ్లైసీమియాతో బాధపడుతున్నవారు వైద్యుడి సలహాతో బొప్పాయిని తినాలి ఎందుకంటే ఇది గ్లూకోజ్ స్థాయిని తగ్గిస్తుంది. అలర్జీ ఉన్న వ్యక్తులు బొప్పాయి తింటే దురద, తుమ్ములు, శ్వాస సమస్యలు ఎదుర్కొనవచ్చు. థైరాయిడ్ సమస్యలున్న వారు ఉన్న కూడా బొప్పాయి తినకపోవడమే బెస్ట్ ఆప్షన్. కిడ్నీలో రాళ్లు ఉన్న వారు బొప్పాయి ఎక్కువగా తినడం హానికరం కావచ్చు.



## రోజూ పొద్దున్నే పసుపు నీళ్లు తాగుతున్నారా?

ఆరోగ్యంగా ఉండటానికి ప్రతి రోజు ఉదయం పసుపు నీరు తాగుతున్నారా..? అది మంచి కంటే ఎక్కువ హాని చేస్తుందని మీకు తెలుసా..? అవును మన ఆరోగ్యానికి, వ్యాధుల నివారణకు పసుపు చాలా అవసరమని మనందరికీ తెలుసు. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సూపర్ ఫుడ్ గా పనిచేస్తుంది. కానీ మీరు ప్రతిరోజూ ఎక్కువగా పసుపు నీరు తాగితే, అది శరీరంపై అనేక హానికరమైన ప్రభావాలను చూపుతుంది. పసుపులోని కర్కుమిన్ అధిక పరిమాణంలో తీసుకుంటే, అది కాలేయ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది. ఇది ఆమ్లత్వం, నొప్పి, గ్యాస్, గుండెల్లో మంట వంటి కడుపు సమస్యలను కలిగిస్తుంది.

పాలు లేదా నీటితో కలిపి పసుపును ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కాలేయం రక్తాన్ని శుద్ధి చేయడానికి, ఆహారాన్ని జీర్ణం చేయడానికి సహాయపడే ఒక ముఖ్యమైన అవయవం. అధిక పసుపు కాలేయంపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. అంతేకాదు. పసుపు నీటిని ఎక్కువగా తాగడం, పచ్చి పసుపును తినడం వల్ల కూడా చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దీనివల్ల దద్దుర్లు, దురద, ఇతర చర్మ సమస్యలు వస్తాయి.

మీకు మూత్రపిండాల్లో రాళ్ల సమస్యలు ఉంటే, మీరు పసుపు ఎక్కువగా తీసుకుంటున్నారా ? అనేదానిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పసుపులో ఆక్సలేట్ అనే పదార్థం ఉంటుంది. ఇది పెద్ద పరిమాణంలో శరీరంలోకి ప్రవేశించినప్పుడు, అది కాల్షియంతో కలిసి కాల్షియం ఆక్సలేట్‌ను ఏర్పరుస్తుంది. మూత్రపిండాల్లో రాళ్ల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుంది. పరిమిత పరిమాణంలో పసుపు మంచిది. కానీ, ప్రతిరోజూ అవసరమైన దానికంటే ఎక్కువ తీసుకోవడం మూత్రపిండాలను ప్రభావితం చేస్తుంది.పరిశోధన ప్రకారం, పసుపు నీరు అధిక రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. పసుపును సరైన పరిమాణంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర, రక్తపోటు స్థాయిలు నిర్వహించబడతాయి. అయితే, ఎక్కువ పసుపు నీరు తీసుకోవడం వల్ల అధిక రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇది ప్రమాదకరం కావచ్చు. పసుపు శరీరంలో ఇనుము శోషణను తగ్గిస్తుంది. దీని అర్థం మీరు పసుపును అధిక పరిమాణంలో తీసుకుంటే, ఆహారంలోని ఇనుము శరీరం ద్వారా సరిగ్గా గ్రహించబడదు. ఇది రక్తహీనతకు దారితీస్తుంది. అందువల్ల, పసుపును ఎక్కువ తీసుకోవడం ఇప్పటికే ఐరన్ లోపం, రక్తహీనత ఉన్నవారికి హానికరం అవుతుంది.

పసుపు సహజంగా రక్తాన్ని పలుచబరిచే మందు. అయితే, మీరు ఇప్పటికే రక్తాన్ని పలుచబరిచే మందులు తీసుకుంటుంటే, పసుపును మితంగా తీసుకోవాలి. ఎక్కువగా పసుపు తీసుకోవడం వల్ల రక్తస్రావం సమస్యలు వస్తాయి.

పసుపు ఎంత మోతాదులో తీసుకోవాలి?

పసుపు మన ఆరోగ్యానికి చాలా అవసరం. ఆయుర్వేదం, వైద్య శాస్త్రం రెండూ దీనిని ప్రయోజనకరంగా భావిస్తాయి. అయితే, పసుపు నీటిని ఔషధంగా రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. మీరు పసుపు నీటిని తాగాలనుకుంటే, పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. రోజుకు ఒక చిటికెడు లేదా గరిష్టంగా అర టీస్పూన్ పసుపు పొడి శరీరానికి సరిపోతుంది.

## టీ20ల్లో బుమ్రా రికార్డు బద్దలు..... చరిత్ర సృష్టించిన వరుణ్ చక్రవర్తి

టీమ్ఇండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అరుదైన ఘనత సాధించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టీ20 ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ రేటింగ్ సాధించిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పటి వరకు జస్‌ప్రీత్ బూమ్రా పేరిట ఉన్న రికార్డును బద్దలుగొట్టి.. కెరీర్ బెస్ట్ రేటింగ్ సాధించాడు. టీ20 వరల్డ్ నేపథ్యంలో భారత డిఫెన్స్ విభాగంలో వరణ్ చక్రవర్తి ఉండటం టీమ్ఇండియాకు మంచి పరిణామంగా కనిపిస్తోంది. కాగా, ఇటీవల ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు కేకేఆర్ వరుణ్ చక్రవర్తిని రిటైన్ చేసుకుంది.

ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుణ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. సఫారీలతో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఇప్పటి రెండేసి వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా 6.75 ఎకానమీతో వికెట్లు తీసిన వరుణ్ చక్రవర్తి.. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 818 పాయింట్లు సాధించాడు. దీంతో రెండో ర్యాంకర్ జేకబ్ డఫీ (699 పాయింట్లు)కి అందనంత దూరంలో నిలిచాడు. జాకబ్ కంటే 119 పాయింట్లు చక్రవర్తికి ఎక్కువగా ఉన్నాయి. 2017లో బుమ్రా కెరీర్ బెస్ట్ 783 రేటింగ్ పాయింట్లతో ఈ ఘనత సాధించాడు. వరుణ్ చక్రవర్తి ఇప్పుడు దాన్ని అధిగమించాడు.

టీ20 వరల్డ్ కప్‌లో కీలక పాత్ర..

గతేడాది బార్బడోస్‌లో టీమ్ఇండియా ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ టైటిల్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయితే టీమ్ఇండియా ఆ టైటిల్‌ను మరోసారి చేజిక్కించుకోవడానికి.. దాదాపు రెండు నెలల సమయమే ఉంది. ఈ తరుణంలో వరుణ్ చక్రవర్తి టీమ్‌లో ఉండటం భారతదేశానికి మంచి పరిణామమే. రెండోసారి టీమ్ఇండియా టీ20 వరల్డ్ కప్ ట్రోఫీని గెలుచుకునే.. ప్రయత్నంలో చక్రవర్తి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

మరోవైపు, లెఫ్ట్‌హ్యాండ్ సీమర్ అర్షదీప్ సింగ్.. దక్షిణాఫ్రికాతో జరిగుతున్న టీ20 సిరీస్‌లోని మూడో మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన అర్షదీప్ సింగ్.. ఐసీసీ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని.. 16వ ప్లేస్‌కు చేరుకున్నాడు. అదే సమయంలో, దక్షిణాఫ్రికాకు చెందిన మార్కో జాన్సెన్ (14 స్థానాలు మెరుగుపడి 25వ స్థానానికి), లుంగీ ఎంగిడి (11 స్థానాలు మెరుగుపడి 44వ స్థానానికి), ఓట్నీల్ బార్ట్‌మాన్ టాప్ 100 కింది నుంచి 68వ స్థానానికి చేరుకున్నారు.



## చెన్నై సూపర్ కింగ్స్ లోకి సంజూ శాంసన్‌ను తీసుకోవడానికి కారణం ధోనీయేనా

ఐపీఎల్‌లో దాదాపు 12 ఏళ్ల పాటు రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు స్టార్ ప్లేయర్ సంజూ శాంసన్. గత నెలలో నాటకీయ పరిణామాల మధ్య సీఎస్‌కే ఇతడిని ట్రేడింగ్ ద్వారా జట్టులోకి తీసుకుంది. దీనికి బదులుగా రవీంద్ర జడేజా, సామ్ కరన్ రాజస్థాన్ జట్టులోకి వెళ్లారు. ప్రస్తుతం అతడికి ఉన్న రూ. 18 కోట్ల ఫీజుకే సంజూను సీఎస్‌కే జట్టులోకి తీసుకుంది. అయితే సంజూ శాంసన్‌ను ఏరికోరి చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఎందుకు జట్టులోకి తీసుకుంది అనే దానిపై అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ విషయంపై తాజాగా సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందించాడు. ఈ ట్రేడింగ్ వెనుక ఉద్దేశమేంటో తెలిపాడు.

ఈ సందర్భంగా దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తు.. ఈ ట్రేడింగ్‌లో ఎలా కీలక పాత్ర పోషించిందో వివరించారు స్టీఫెన్ ఫ్లెమింగ్. ధోనీ రిటైర్మెంట్ తర్వాత.. టీమ్ ఫ్యూచర్ కోసం సన్నాహాలు చేయాలని సీఎస్‌కే అనుకుంటోందని చెప్పాడు. అందుకే శాంసన్‌ను జట్టులోకి తీసుకున్నామని ఫ్లెమింగ్ తెలిపాడు. "మా (సీఎస్‌కే) ఓపెనింగ్ బ్యాటింగ్ ఇంకా కొంత బలహీనంగా ఉందని మేము భావించాము. అంతేకాకుండా ఏదో ఒక సమయంలో ధోనీ జట్టు నుంచి తప్పుకుంటాడనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నాము. మరోవైపు, సంజూ ఒక అంతర్జాతీయ స్థాయి ఆటగాడు. అతను తన పాత్రను చాలా చక్కగా పోషిస్తాడని అనుకున్నాం. అందుకే జట్టులోకి తీసుకున్నారం. ఇది ధోనీ తర్వాత తరం వారసత్వ ప్రణాళిక మాత్రమే కాదు. పూర్తిగా జట్టును పునరుత్తేజపరచడం మా ఉద్దేశం. రెండేళ్ల తర్వాతే కాదు.. ఆరేళ్ల తర్వాత కూడా చెన్నై జట్టు ఎలా ఉంటుందో చూడటం కూడా దీని ఉద్దేశం" అని న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ పేర్కొన్నాడు.

కాగా, 44 ఏళ్ల ధోనీ తన కెరీర్ చివరి దశలో ఉన్నాడు. తను ఆడాలనుకున్నా పరిస్థితులు సహకరించే అవకాశం లేదు. ఇక కేరళకు చెందిన సంజూ వయసు ఇప్పుడు కేవలం 31 సంవత్సరాలే. ఒకవేళ అతడు తన ఫామ్, ఫిట్‌నెస్‌ను కొనసాగించగలిగితే.. కనీసం మరో ఐపీఎల్ సీజన్ వరకు అయినా సీఎస్‌కే తరపున ఆడే అవకాశం ఉంది. చెన్నై జట్టులో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఫామ్ నిలకడగా ఉంటే.. సారథ్య బాధ్యతలు కూడా అప్పగించే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అంటున్నారు.

కాగా, అనుభవం ఉన్న ప్లేయర్లను తీసుకోవడంలో చెన్నై పెట్టింది పేరు. అయితే అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరించింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యంగ్ ప్లేయర్లపై భారీ ఇన్వెస్ట్ చేసింది. అందులో భాగంగా అన్‌క్యాప్డ్ ప్లేయర్లు వికెట్ కీపర్ బ్యాటర్ కార్తిక్ శర్మ, ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్‌ను రూ.14.2 కోట్ల చొప్పున కొనుగోలు చేసింది. వీరితో పాటు బౌలింగ్ విభాగంలో మాట్ హెన్రీ, అకీల్ హుస్సేన్‌ను కూడా తీసుకుంది.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..